

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

వికారాబాద్, మే7(ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు డీపీఆర్‌సీ భవనంలో నిర్వహిస్తున్నట్లు జడ్పీసీఈవో సుధీర్‌తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు. ఇదిలా ఉంటే, మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థిగా జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారంలో నిమగ్నం కావడం, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలకు ప్రచార బాధ్య తలు అప్పగించడంతో వారు హాజరయ్యే అవకాశం కనిపించడం లేదు.



విద్యార్థి కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం, పోలీసులు

సెల్ఫీ దిగుతూ క్వారీగుంతలో పడి
బీటెక్ విద్యార్థి గల్లంతు

ఘట్‌కేసర్ రూరల్, మే 7 : సెల్ఫీ దిగుతుండగా ప్రమాదవశాత్తూ క్వారీ గుంతలో పడి బీటెక్ విద్యార్థి గల్లంతయ్యాడు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరుకు చెందిన యశ్వంత్(19) నారపల్లిలోని హాస్టల్‌లో ఉంటూ, మేడ్చల్‌జిల్లా, ఘట్‌కేసర్ మండలం, కొర్రెములలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం ముగ్గురు స్నేహితులతో కలిసి యశ్వంత్ సెల్ఫీ దిగడానికి పోచారం మున్సిపల్ పరిధి అన్నోజిగూడ సమీపంలోని క్వారీగుంత వద్దకు వెళ్లారు. సెల్ఫీ దిగుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి క్వారీగుంతలో పడిపోయాడు. అతన్ని కాపాడుదామని స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోచారం ఐటీసీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని ఎన్డీఆర్ఎఫ్ బృందం సహాయంతో మూడు గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టారు. ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో గాలింపునకు ఆటంకం కలిగింది. గాలింపు చర్యలు నేడు ఉదయం చేపడుతామని తెలిపారు. గతంలో జరిగిన ప్రమాదాల దృష్ట్యా క్వారీ చుట్టూ కంచె ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజువర్మ తెలిపారు.






పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

తాగునీరు వృథా

తాండూరు, మే 7: ఎండల తీవ్రత ఉన్నందున తాగునీటిని వృథా చేయొద్దని, లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా తాండూరు మున్సిపాలిటీ అధికారులు పెడచెవిన పెడుతున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి ఈ పైపులైన్ లీకేజీ ఉదాహరణగా చెప్పవచ్చు. శాంతినగర్ పార్కువద్ద ఉన్న పైప్‌లైన్ పగిలి నీరంతా రోడ్డుపై పారుతోంది. తాండూరు మున్సిపల్ పరిధిలో ఇలాంటి లీకేజీలు ఎక్కడబడితే అక్కడే కనిపిస్తున్నాయి. ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యంతో లీకేజీలు లేకుండా మరమ్మతులు చేయడానికి నెలలు సమయం పడుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న కీలక సమయంలో ప్రధాన పార్టీలకు కోవర్టుల భయం పట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు ఒక పార్టీలో ఉన్న ముఖ్య నేతలు లోక్‌సభ ఎన్నికల ముందు మరో పార్టీలోకి మారారు. కొత్త వారిలో తమ కోసం పని చేస్తున్న వారెవరో, ఆర్భాటానికే పరిమితమవుతున్న వారెవరో తెలియక తలలు పట్టుకుంటున్నారు. . కీలకమైన ఈ సమయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే మొదటికే మోసం వస్తుందన్న భయంతో అభ్యర్థులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.



కోవర్టులతో పరేషాన్!

- ప్రధాన పార్టీల్లో కట్టప్పలు!
- లోక్‌సభ ఎన్నికలకు సమీపిస్తున్న గడువు
- వెంటాడుతున్న భయం
- కోవర్టులు తెలిసినా మిన్నకుండిపోతున్న నేతలు

వికారాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి) : లోక్ సభ ఎన్నికల సమయంలో ప్రధాన పార్టీలకు కోవర్టుల భయం పట్టుకుంది. పార్టీలో ఎవరు అనుకూలంగా పనిచేస్తున్నారు.. క్షేత్రస్థాయిలో పనిచేయకుండా నామమాత్రంగా ఎవరు ఉంటున్నారు ? సన్నిహితంగానే ఉంటూ వెన్నుపోటు పొడిచే కార్యక్రమాలు ఎవరు చేపడుతున్నారనే విషయమై ముఖ్య నేతలు ఆరా తీస్తున్నారు. మరో పక్క ప్రచార కార్యక్రమాలతో పాటు ఓటు బ్యాంకు వ్యూహాలను ఎప్పటికప్పుడు రచిస్తూ వాటిని అమలు చేసే బాధ్యతను తమ సన్నిహితులకు అప్పగిస్తున్నారు. ఎన్నికల ప్రచారం, ఓటర్లను తమవైపు తిప్పుకునే వ్యూహాల్లో ప్రధాన పార్టీలు, ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు నిమగ్నమయ్యారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ప్రధాన పార్టీలకు ఇప్పుడు కోవర్టుల భయం పట్టుకుంది. గెలుపోటములను తారుమారు చేసే ఈ సమయంలో వెన్నంటి ఉంటూనే వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా పెట్టారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికలను ప్రధాన పార్టీల్లో కాంగ్రెస్, బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా లోక్‌సభ ఎన్నికల్లో గ్రామాల అన్నింట్లో అభ్యర్థులు, ముఖ్య నేతలు ప్రచారం నిర్వహించడం సాధ్యం కాని విషయం విదితమే. అధికార పార్టీ నాయకులు గత ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ప్రకారం గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తున్నదంటూ ప్రజల్లోకి తీసుకువెళుతూ లోక్‌సభ ఎన్నికల్లోనూ తమకే ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. బీజేపీ కేంద్రంలో మోదీ ప్రభుత్వం విజయాలను వివరిస్తూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలు తీరుపై నిలదీస్తూ ప్రజల్లోకి వెళుతున్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ తమకే ఓటు వేయాలంటూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారు.

ఆచితూచి..

లోక్‌సభ ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో గ్రామాలు, వార్డుల్లో ఓటర్లను ప్రభావితం చేసే నాయకులపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. తమకు అనుకూలంగా ఓటు వేయించే నాయకులతో ప్రధాన పార్టీల ముఖ్య నేతలు సంప్రదింపులు చేస్తున్నారు. ఒక పార్టీకి చెందిన వారితో మరో పార్టీకి చెందిన నాయకులు టచ్‌లోకి వెళుతున్నారన్న సమాచారం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎవరిని విశ్వసించాలో.. ఎవరిని దూరం పెట్టాలో తెలియక తలపట్టుకుంటున్నారు. కీలకమైన ఈ సమయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే మొదటికే మోసం వస్తుందన్న భయంతో ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

కోవర్టు ఆపరేషన్లకు పాల్పడే వారు ఒకరకంగా రాజకీయ కట్టప్పలు. ఎప్పుడు వెన్నుపోటు పొడుస్తారో చెప్పలేం. వచ్చిన చిక్కల్లా ఆ కోవర్టులను ఎలా పసిగట్టడమనేది అభ్యర్థులకు, పార్టీల ముఖ్య నేతలకు సవాల్‌గా మారింది. కోవర్టులుగా పనిచేస్తున్నారనే అనుమానం వచ్చినా ఎన్నిక సమీపిస్తున్న ఈ సమయంలో నేరుగా ప్రశ్నించలేని పరిస్థితి. పోలింగ్ సమీపిస్తున్న ఈ సమయంలో ప్రతి ఓటు, ప్రతి నేత ముఖ్యం


ఏమీ అనలేక..

కావడంతో ఏమీ అనలేకపోతున్నారు. కోవర్టులుగా అనుమానం వచ్చిన నాయకులకు ముఖ్య సమాచారం తెలియకుండా వారిపై నిఘా పెడుతూ జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. అనుమానం వచ్చిన వారిపై బాహాటంగా కోవర్టులుగా ముద్రవేసినా, అనుమానించే విధంగా వ్యవహరించినా మొదటికే మోసం వస్తుంది. పనిచేసే వారు కూడా పనిచేయకుండా ఉండిపోతారనే భయం వెంటాడుతోంది.

అభ్యర్థులు ఎవరైనా తమ ప్రత్యర్థులను మానసికంగా బలహీనంగా మార్చేందుకు, దెబ్బతీసేందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తుంటారు. ఎక్కువ కోణాల్లో దెబ్బతీస్తే మానసికంగా బలహీనమై తన విజయావకాశాలపై ఆశలు వదులుకునేలా చేసేలా ప్రయత్నిస్తుంటారు. ప్రత్యర్థి వ్యూహాలను దెబ్బతీసి తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కోవర్టులను రంగంలోకి దించిన

వ్యూహాలపై నిఘా..

పార్టీలు ... కేవలం ప్రచార వ్యూహాలే కాకుండా ప్రత్యర్థి పార్టీ ప్రలోభాల వ్యూహాలపై కూడా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచారంతో పాటు సోషల్ మీడియా, హామీలు, విమర్శలు, ఆరోపణలు, ఓటర్లకు నజరానాల పంపిణీలో ప్రత్యర్థి కంటే ముందు దూసుకు వెళ్లాలని చూస్తుంటారు. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రత్యర్థి పార్టీ మద్యం, నగదు పంపిణీ చేయకుండా కట్టడి చేసే ప్రయత్నాలు చేస్తుంటారు. కోవర్టులు ఇచ్చే సమాచారం అభ్యర్థుల విజయావకాశాల్లో కీలకంగా మారుతున్న విషయం తెలిసిందే.




ప్రత్యర్థి పక్షంలో ఉంటూ..

స్వపక్షంలోనే ఉండి పనిచేసే కన్నా ప్రత్యర్థి వర్గంలో చేరి అక్కడి వ్యూహాలను తెలుసుకునేందుకు చురుకుగా ఉండే నాయకులను ప్రత్యర్థి పార్టీల్లోకి పంపిస్తుంటారు. ఎన్నికల సమయంలో కొనసాగే చేరికల్లో ఇలాంటి నాయకులు పార్టీలు మారుతుంటారు. ఎదుటి పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ ఎన్నికల వ్యూహాలను తమ వారికి చేరవేస్తుంటారు. ఇలాంటి ఎత్తుగడల్లో నిష్ణాతులైన వారిని ఎంపిక చేసి మరీ ప్రత్యర్థి పార్టీల్లోకి పంపిస్తుంటారు. రాజకీయ ఎత్తుగడల్లో ఓటర్లను అభ్యర్థించడం కంటే ఇలాంటి కోవర్టు రాజకీయాలకే పెద్దపీట వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరు మన కోసం పనిచేస్తున్నారు ? పార్టీలోనే ఉంటూ వేరే వారి కోసం ఎవరు పనిచేస్తున్నారనేది తెలుసుకోవడమనేది కూడా సవాల్‌గా మారింది. పక్కా నిఘా పెడితే తప్పా గుర్తించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యనేతలకు తలలో నాలుకలా వ్యవహరిస్తూ అక్కడి రాజకీయ ఎత్తుగడలకు సంబంధించిన ముఖ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు అవతలి పార్టీ నేతలకు చేరవేస్తున్నారనే గుబులు అంతర్గతంగా నెలకొంది.

టీడీపీ ఓటు ఎటువైపు?

శివార్లలో భారీగా టీడీపీ సానుభూతిపరులు

- రసవత్తరంగా మారుతున్న రాజకీయాలు
- తాజాగా బీజేపీకి టీడీపీ మద్దతు



ఘట్‌కేసర్, మే 7: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలంగాణలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలన్నీ ఎత్తులకు పైఎత్తులు వేస్తూ సరికొత్త వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. దశాబ్ధాల కాలంగా ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ రాష్ట్రవిభజన తరువాత తెలంగాణలో కనుమరుగైన విషయం తెలిసిందే. తెలంగాణలో గడిచిన అసెంబ్లీ ఎన్నికలతో పాటు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో కూడా టీడీపీ ఎక్కడా పోటీ చేయడం లేదు. ఇదే సమయంలో ఏపీలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో తెలుగుదేశం-బీజేపీ-జనసేన ఎన్డీఏ కూటమిగా ఏర్పాడ్డాయి. దీంతో అనివార్యంగా తెలంగాణలో కూడా బీజేపీ పార్టీకి తెలుగుదేశం పార్టీ మద్దతు ప్రకటించించి. ఈ కారణంగా రాజకీయం మరింత ఆసక్తికరంగా మారుతోంది. అయితే టీటీడీపీ ఆలస్యంగా బీజేపీకి మద్దతు తెలపడంతో బీజేపీకి టీడీపీ కేడర్, సానుభూతిపరుల ఓట్లు ఎంత వరకు కలిసి వస్తాయి? అనేది చర్చనీయాంశంగా మారింది. గతఅసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఓటర్లలో ఎక్కువ మంది బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు అనుకూలంగా ఓటేశారు. ఇప్పుడు టీడీపీ నాయకత్వం బీజేపీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడంతో తమకు లాభిస్తుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. అయితే అధికార కాంగ్రెస్ కూడా టీడీపీ సానుభూతి పరుల ఓటు బ్యాంకును తమ వైపు తిప్పుకునేయత్నం చేస్తోంది.

బీజేపీతో కలిసివస్తే...

ఇదిలా ఉంటే బీజేపీతో పొత్తు కలిసి వస్తే భవిష్యత్‌లో తెలంగాణలోనూ బీజేపీతో కలిసి ముందుకు సాగే అవకాశాలు ఉన్నాయి. టీడీపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ టీడీపీని వీడి బీఆర్ఎస్‌లో చేరి బీఆర్ఎస్ అభ్యర్థిగా చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. అయనకు టీడీపీ స్థానిక నేతలతో

మిగతా 6వ పేజీలో...

దంచికొట్టిన వాన



అన్నోజిగూడలో జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

శివార్లలో భారీ వర్షపాతం నమోదు

- పలు చోట్ల పిడుగులు, వడగళ్ల వర్షం
- రెండు గంటల్లో కుండపోత
- కూకట్‌పల్లిలో అత్యధికంగా 10.8 సెం.మీ
- అన్నోజిగూడలో హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/వికారాబాద్ ప్రతినిధి/ఘట్‌కేసర్/కీసర/యాచారం/ఇబ్రహీంపట్నం/కొందుర్గు/ఘట్‌కేసర్ రూరల్/మేడ్చల్ టౌన్/మర్పల్లి/మొయినాబాద్/షాద్‌నగర్/చౌదరిగూడ /పూడూరు, మే7) ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షం దంచి కొట్టింది. ఉరుములు, మెరుపులు పిడుగులు, గాలి బీభత్సంతో పాటు వడగళ్ల వర్షాలు కురిశాయి. కేవలం రెండు గంటల వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 10సెం.మీపైగా వర్షం పడడంతో రోడ్లన్ని జలమయంగా మారాయి. గాలి, వర్షాలకు పలు చోట్ల చెట్లు కూలాయి. భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న ప్రజానీకం మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. గత కొన్నాళ్లుగా ఎండలు పెరుగుతుండడంతో నిప్పుల కుంపటిగా మారిన విషయం తెలిసిందే. ఈ ఏడాది అనేక ప్రాంతాల్లో 45 డిగ్రీలకుపైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవిలో భూగర్భజలాలు అడుగంటడంతో భూగర్భజలాలు అడుగంటి తాగునీటి సమస్య కూడా తీవ్ర రూపం దాల్చింది. ఈ సమయంలో అనేక మండలాల్లో కురిసిన భారీ నుంచి మోస్తరు వర్షాలకు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండలు ఠారెత్తిస్తుండడంతో ప్రజలు ఎండ తీవ్రత, ఉక్కబోతలతో సతమతమయ్యారు. అయితే మంగళవారం సాయంత్రం ఉమ్మడి జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారింది. పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. పలు చోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులు, గాలి బీభత్సం సృష్టించాయి. రోడ్లు నీట మునిగి ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. విద్యుత్ సరఫరాకు కూడా అవంతరాలు ఏర్పడ్డాయి. శేరిలింగంపల్లిలో అత్యధికంగా 10.8 సెం.మీ వర్షపాతం నమోదైంది. అలాగే కూకట్‌పల్లిలో 10.7 సెం.మీ వర్షం కురిసింది. కేవలం రెండు గంటల్లోనే ఇంత భారీ వర్షం నమోదు కావడం గమనార్హం. మేడ్చల్ జిల్లా బాచుపల్లిలో 9.6 సెం.మీ, బాలానగర్‌లో 6.7 సెం.మీ, కుత్బుల్లాపూర్‌లో 5.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. అలాగే గండిపేట, మొయినాబాద్, చేవెళ్ల, హయత్‌నగర్, సరూర్‌నగర్, కీసర, ఘట్‌కేసర్, ఉప్పల్, నవాబుపేటలో రెండు నుంచి మూడు సెం.మీ వర్షపాతం కురిసింది. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల్లో భారీ

మిగతా 6వ పేజీలో...

పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు
సమన్వయంతో పనిచేయాలి

- పోలింగ్‌స్టేషన్లలో వసతులు కల్పించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



పరిగి, మే7: పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పరిగి తహసీల్దార్ కార్యాలయం నుంచి చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి పోలింగ్‌స్టేషన్‌కు లొకేషన్ ఇన్‌చార్జి అధికారిని నియమించాలని సూచించారు. రూరల్ పరిధిలో ఎంపీడీవో, అర్బన్ పరిధిలో మున్సిపల్ కమిషనర్ ఇన్‌చార్జి అధికారిని నియమించి, అట్టి జాబితాను పంపాలన్నారు. రెండు రోజుల్లో పోలింగ్‌స్టేషన్లకు సంబంధించి అన్ని వసతులు కల్పించాలన్నారు. పోలింగ్‌స్టేషన్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, దివ్యాంగులకు వీల్‌చైర్ ఏర్పాటు చేయాలని సూచించారు. 13వ తేదీన ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. బీఎల్‌వోలు ఓటర్ స్లిప్పులను అందరికీ పంపిణీ చేయాలని సూచించారు. పోలింగ్ రోజు ఉదయం టిఫిన్,మధ్యాహ్నం లంచ్ వసతి కల్పించాలని ఇన్‌చార్జి అధికారులకు సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహరతి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్రచ జడ్పీ సీఈవో సుధీర్, ఈఈ ఉమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వికారాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల విధులు నిర్వహించే వివిధ శాఖల ఉద్యోగుల్లో కొందరి ఓటు హక్కు గల్లంతు కావడంపై ఎన్నికల ఉన్నతాధికారులు స్పందించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు వికారాబాద్ ఫెసిలిటేషన్ సెంటర్‌కు వచ్చిన పలువురు ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర శాఖల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితాలో తమ పేర్లు గల్లంతు కావడంతో కంగుతిన్న విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో తమ వివరాలు ఉన్నా.. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితాలో ఎలా గల్లంతయ్యాయంటూ ఫెసిలిటేషన్ కేంద్రం అధికారులను వారు ప్రశ్నించిన విషయం తెలిసిందే. 'పోస్టల్ బ్యాలెట్ జాబితాలో పేర్లు గల్లంతు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎన్నికల అధికారులు స్పందించారు. ఎన్నికల శిక్షణ తరగతులకు హాజరైన సమయంలో ఫారం-12లో తమ వివరాలు, ఓటరు గుర్తింపు కార్డు, ఎన్నికల విధుల ఉత్తర్వుల కాపీ జతపరిచినా పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఎలా గల్లంతయ్యాయని టీఎస్‌పీఆర్‌టీయూ నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితాలో తమ వివరాలు లేకపోయినా, లేదా తప్పుగా నమోదైనా, లేదా ఇతర తప్పిదాలు చోటు చేసుకున్నా.. మరోసారి ఫారం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

ఎన్నికల విధుల ఉద్యోగులకు
మరో ఛాన్స్

అమిత్‌షా సభా ఏర్పాట్ల పరిశీలన

వికారాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 11వ తేదీన వికారాబాద్‌లో జరగనున్న అమిత్ షా బహిరంగ సభ ఏర్పాట్లను రాజస్థాన్ ఎమ్మెల్యే ఛగన్ సింగ్ రాజ్ పురోహిత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కో ఆర్డినేటర్ వడ్ల నందు, స్థానిక జిల్లా నాయకులతో కలిసి పరిశీలించారు. వేదిక, జాతీయ, రాష్ట్ర నాయకులు, పార్టీ జిల్లా నాయకులు, మీడియా కోసం ఎక్కడెక్కడ ఏర్పాట్లు చేయాలనే విషయమై చర్చించారు. సభా వేదిక ఏర్పాట్లను బుధవారం ప్రారంభించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా నాయకులు కేపీ రాజు, రాజేందర్‌రెడ్డి, బుస్సా శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాజస్థాన్ ఎమ్మెల్యే ఛగన్‌సింగ్ రాజ్ పురోహిత్, జిల్లా నాయకులు

టీడీపీ ఓటు ఎటువైపు?

(ఐదో పేజీ తరువాయి)

సంబంధాలు ఉండడంతో టీడీపీ శ్రేణులు, ఓటు బ్యాంకు ఇప్పుడు ఎటువైపు మొగ్గు చూపుతారనే విషయం ఆసక్తిగా మారింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 29,38,370 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 15,04,260 ఉన్నారు. మహిళా ఓటర్లు 14,33,830 ఉండగా థర్డ్ జెండర్స్ 280 ఉన్నారు. అత్యధిక ఓటర్లు 7,58,102 శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో సెటిలర్స్ ఓట్లు ఎక్కువగా ఉంటాయి. వీరంతా ఏ పార్టీకి వేయబోతున్నారనేది హాట్ టాపిక్‌గా మారింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజవర్గ స్థానానికి మొత్తం 43 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అందులో ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే పోటీ నెలకొంది. ప్రస్తుతం కారు జోరు అంతగా కనిపించడం లేదు. కానీ.. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. తాజా రాజకీయ పరిణామాల మేరకు తెలంగాణలో బీజేపీకి తెలుగుదేశం పార్టీ మద్దతు తెలపడంతో రాజకీయ పరిస్థితులు మారే అవకాశాలున్నాయి.

టీడీపీ కంచుకోట..

రంగారెడ్డి జిల్లా అంటే ఒకప్పుడు టీడీపీకి కంచుకోట. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి వంటి బలమైన అధినేతలంతా టీడీపీ నుంచే వచ్చిన వారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాలతో టీడీపీ క్యాడర్ చెల్లా చెదురైంది. చాలా మంది నాయకులు పార్టీ మారారు. జిల్లాలో 2014 వరకు టీడీపీ పటిష్ఠంగా ఉంది. 2009లో చేవెళ్ల లోక్ సభ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డికి గట్టి పోటీ ఇచ్చారు. జైపాల్‌రెడ్డికి 4,20,807 ఓట్లు లభించగా. జితేందర్‌రెడ్డికి 4,02,275 ఓట్లు వచ్చాయి. స్వల్ప మెజారిటీతో జితేందర్‌రెడ్డి ఓటమి చెందారు. తెలంగాణ ఉద్యమం తెరపైకి రావడం.. ఉన్నంట్టుండి రాజకీయ పరిణాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భాంతో టీడీపీలో ఉన్న నేతలంతా బీఆర్ఎస్‌లోకి చేరారు. ఇంకా గ్రామాల్లో తెలుగు తమ్ముళ్లు కొంత మంది కాంగ్రెస్, బీజేపీలోకి చేరగా మిగతా వారందరూ ఎటు వెళ్లాలో తెలియక అయోమయంలో ఉండి పోయారు. ఉమ్మడి జిల్లాలో గత శాసన సభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం పని చేశారు. ఒక్కో నియోజకవర్గంలో టీడీపీకి ఓటు బ్యాంకు భారీగానే కలిగిఉన్నదని ఆపార్టీ నాయకులు వివరిస్తున్నారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అక్కడక్క అసెంబ్లీ స్థానానికి పోటీ చేసేందుకు ఒకరిద్దరు నాయకులు ముందుకు వచ్చినప్పటికి అధిష్ఠానం ఎలాంటి గ్రీన్ సిగ్నల్ రాకపోవడతో వెనుకడుగు వేశారు. లోక్ సభ ఎన్నికల్లో కూడా పోటీ ప్రస్తావన లేకపోయింది. తాజాగా టీడీపీ బీజేపీకి మద్దతు ఇవ్వాలని తెలియజేయడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది.

టీడీపీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు వీరే

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల శాసనసభ స్థానం నుంచి 1985, 1989,1994లో పట్లోళ్ల ఇంద్రారెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2009లో కేఎస్ రత్నం తెలుగుదేశంపార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

- ఇబ్రహీంపట్నం శాసన సభ నియోజకవర్గం కె. సత్యానారాయణ టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో కొండ్రు పుష్పలీల టీడీపీ నుంచి విజయం సాధించారు. 2009, 2014లలో టీడీపీ నుంచి మంచిరెడ్డికిషన్‌రెడ్డి గెలుపొందారు.
- మహేశ్వరం శాసన సభ నియోజకవర్గం నుంచి 2014లో తీగల కృష్ణారెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.
- రాజేంద్రనగర్ అసెంబ్లీ స్థానం నుంచి 2009, 2014లో జరిగి శాసన సభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి ప్రకాష్‌గౌడ్ పోటీ చేసి విజయం సాధించారు.
- శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి 2014లో అరికెపూడి గాంధీ తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.
- ఎల్బీనగర్ శాసన సభకు 2014లో తెలుగుదేశం పార్టీ నుంచి ఆర్ కృష్ణయ్య పోటీ చేసి విజయం సాధించారు.
- మేడ్చల్ శాసనసభ నుంచి 1985లో కొమ్మారెడ్డి సురేందర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. టీడీపీ నుంచి టి. దేవేందర్‌గౌడ్ వరుసగా 1994, 1999, 2004లో గెలుపొందారు.
- వికారాబాద్ శాసనసభ స్థానం 1983 తర్వాత తెలుగుదేశ పార్టీకి కంచుకోటగా మారింది. వరుసగా 4 పర్యాయాలు తెలుగుదేశం పార్టీ తరపున ఏ. చంద్రశేఖర్ విజయం సాధించారు. చంద్రశేఖర్ పార్టీ మారడంతో తెలంగాణ దేశం పార్టీ విజయాలకు బ్రేక్ పడింది.
- తాండూరులో టీడీపీ పాగా వేసింది.. 1994, 1999, 2009లో టీడీపీ నుంచి పట్నం మహేందర్‌రెడ్డి పోటీ చేసి విజయం సాధించారు 2014లో తెలంగాణ ఉద్యమంతో టీడీపీ ప్రాబల్యం తగ్గిపోయింది.
- పరిగి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1985, 1995, 1999, 2004, 2009 లో కొప్పుల హరీశ్వర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

తొమ్మిది రోజుల వ్యవధిలో
ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి

- మొదట తల్లి, కొద్ది రోజుల వ్యవధిలో ఇద్దరు కొడుకుల మృత్యువాత
- శంషాబాద్‌లో విషాదం


టి.పద్మమ్మ(ఫైల్)


టి.మల్లేష్(ఫైల్)


శ్రీనివాస్(ఫైల్)

శంషాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి) :శంషాబాద్ పట్టణ సిద్ధాంతిబస్తీలో ఒకే కుటుంబానికి తల్లి, ఇద్దరు కొడుకులు తొమ్మిది రోజుల వ్యవధిలో మృతిచెందారు. దీంతో స్థానికంగా విషాదం నెలకొంది. ఈ సంఘటన వివరాల్లోకి వెళ్తే.. టీఎం టైలర్స్‌గా పేరున్న ఈ కుటుంబంలో టి.పద్మమ్మ(65) ఏప్రిల్ 27న అనారోగ్యంతో చనిపోయింది. ఆమె దశదినకర్మకు ఏర్పాట్లు చేస్తుండగానే ఈ పెద్దకొడుకు టి.మల్లేష్(48) అనారోగ్యానికి గురయ్యాడు. అతడి ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. ఈ నెల 4న గుండెపోటుతో అతడు మృతిచెండాడు. కుటుంబంలో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలతో దిగ్భ్రాంతికి గురైన పద్మమ్మ మరో కొడుకు శ్రీనివాస్(40) ఈ నెల 6న అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబీకులు అతడికి ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తరలించారు. సోమవారం రాత్రి శ్రీనివాస్ సైతం మరణించాడు. ఇలా ఒకే కుటుంబంలో వరుసగా ముగ్గురు మృతిచెందడం స్థానికంగా చర్చనీయాంశమైంది.


వర్షానికి ఎదులాబాద్ వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు

దంచికొట్టిన వాన

(ఐదో పేజీ తరువాయి)

ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. యాచారం, మాల్, చౌదర్‌పల్లి, తమ్మలోనిగూడ, మేడిపల్లి, గున్‌గల్, నానక్‌నగర్, గ్రామాలలో ఈదురు గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఇబ్రహీంపట్నం పరిధిలో ఈదురుగాలులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అక్కడక్కడ మామిడికాయలు నేలరాలాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయి గ్రామాల్లో అంధకారం చోటుచేసుకుంది. కొందుర్గు మండలంతో పాటు షాద్‌నగర్, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లచ్చంపేట్, తుమ్మలపల్లి, వనంపల్లి, చౌదరిగూడ, రావిర్యాల, వీరన్నపేట్ తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. గాలి దుమారానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మేడ్చల్ జిల్లా కీసర, నాగారం, దమ్మాయిగూడ పరిధిలో ఈదురుగాలులతో జోరుగా వర్షం కురిసింది. మర్పల్లి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలు, మేడ్చల్, మంచాల మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ఘట్‌కేసర్‌లో అకాల వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ధాన్యం కొనుగొలు కేంద్రాల వద్ద రాసులు(కుప్పలు)పోసుకొని కాంటల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో వర్షం కురియడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు ఎండిన ధాన్యం కింది భాగం తడిసిపోయో ప్రమాద ముందని రైతులు వాపోతున్నారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది, ఉరుములు, మెరుపులతోపాటు ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్, మాదారం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం రాశులలోకి వరదనీరు రాకుండా రైతులు కాలువలు చేశారు. రోడ్లపైవరదనీరు చేరింది. పూడూరు మండలం తిర్మాలాపూర్‌లో మోస్తరు వానతో పాటు పలు చోట్ల వడగళ్ల వర్షం కురిసింది.

భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు

వాతావరణ మార్పులతో ఉమ్మడి జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి . మంగళవారం ఉదయం నుంచే మబ్బులు ఉండడంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలలోపే నమోదయ్యాయి. మేడ్చల్ జిల్లా జీడిమెట్లలో 42.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రంగారెడ్డిజిల్లా శేరిలింగంపల్లిలో అత్యధికంగా 42.6 డిగ్రీలు నమోదుకాగా వికారాబాద్ జిల్లా మరల్పిల్లిలో అత్యధికంగా 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక రాత్రిపూట ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి.

పోలింగ్ ప్రక్రియలో పొరపాట్లకు తావివ్వద్దు

● చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశాంక

తాండూరు/పరిగి/వికారాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు చోటు కల్పించకుండా సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశాంక అన్నారు.


వికారాబాద్ : ఈవీఎంల కమిషనింగ్ వివరాలను తెలియజేస్తున్న నారాయణరెడ్డి

మంగళవారం వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి ఈవీఎంల స్ట్రాంగ్‌రూం, మేరీ ఏ నాట్స్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఈవీఎంల కమిషనింగ్, ఫెసిలియేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో హెల్ప్‌డెస్క్‌లను సందర్శించి ఫెసిలియేషన్ కేంద్రంలో కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై ఆరా తీశారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, తదితరులున్నారు. అంతకుముందు కలెక్టరేట్‌కు వచ్చిన శశాంకకు కలెక్టర్, ఎస్పీ కోటిరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, జడ్పీ సీఈవో సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కలెక్టర్ శశాంక తాండూరు పట్టణంలోని ఓటర్ ఫెసిలియేషన్ సెంటర్, సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లోని స్ట్రాంగ్‌రూంలను నారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. ఇన్‌చార్జి వెంకటేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. స్ట్రాంగ్‌రూం వద్ద సహాయ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రావుకు పలు సూచనలు చేశారు. అలాగే శశాంకతో పాటు కలెక్టర్ నారాయణరెడ్డి, తదితరులు పరిగిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.02లో ఫెసిలిటేషన్ కేంద్రంలో జరుగుతున్న పోస్టల్ ఓటింగ్ విధానాన్ని వారు పరిశీలించారు. పరిగి పట్టణంలోని ఖేల్ ఇండియా సెంటర్‌లోని ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ను సందర్శించి ఈవీఎంల కమిషనింగ్‌ను అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్‌కు అన్ని వర్గాల ఆదరణ

● చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

రాజేంద్రనగర్, మే 7 : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆదరిస్తున్నారని డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం గోల్డెన్ హైట్స్ కాలనీ, హ్యాపీహోమ్స్ కాలనీలో క్రైస్తవ, ముస్లిం మైనారిటీ నాయకులు, ముఖ్యులతో సమావేశమయ్యారు. రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో అన్నివర్గాలను, అన్ని మతాలను సమానంగా ప్రేమించేది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ సమాజానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఎప్పుడో ఖాయమైందన్నారు. పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల విద్యాసంస్థల వైస్ చైర్మన్ మహ్మద్ ఫహీమ్ ఖురేషీ మాట్లాడుతూ రంజిత్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. పలుగుచెరువు మహేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రాజేంద్రనగర్ : హ్యాపీ హోమ్స్ కాలనీలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

రంజిత్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలి

యాలాల : చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. యాలాల మండలం విశ్వనాథ్‌పూర్ మాజీ సర్పంచ్ సత్యమ్మ భర్త అశోక్ తన అనుచరులతో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఉప సర్పంచ్ శరణప్ప, బషీర్ మియ తండా చెందిన చందర్‌నాయక్, కోకట్ గ్రామానికి చెందిన కృష్ణ, కర్నె నరేష్, మాజీ ఎంపీటీసీ హనుమప్ప, తదితరులు చేరారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు మేలు

దోమ : ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు మేలు జరిగిందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దోమ మండలం మోత్కుర్, కొండయపల్లి, బడెంపల్లి తదితర గ్రామాల్లో రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మైలారం ఎంపీటీసీ రాములు, తదితరులున్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

షాబాద్ : ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు బీఎల్వోలు కృషి చేయాలని చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. షాబాద్ మండలం నాగర్‌గూడలోని ఓ గార్డెన్‌లో మండల 54 బూత్ లెవల్ బీఎల్వోల శిక్షణ సమావేశానికి హాజరయ్యారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, తదితరులున్నారు.

ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించుకుందాం

చేవెళ్ల/కందుకూరు/ : చేవెళ్ల నుంచి మరోసారి రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకుందామని చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు వసంతం అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్ఎస్, బీజేపీల నుంచి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కందుకూరు మండంలోని జబ్బార్‌గూడ మాజీ సర్పంచ్ సుగుణమ్మతో పాటు పెద్దమ్మ తండా ఉపసర్పంచ్ రేఖ్యానాయక్, గుమ్మడవెళ్లి తండా, ధన్నారం, ముచ్చర్ల నుంచి వంద మంది కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, జడ్పీటీసీ జంగారెడ్డి, తదితరులున్నారు.


మర్పల్లి : స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మర్పల్లి మండల నాయకులు

ఆరు గ్యారెంటీలతో ప్రతీ కుటుంబానికి లబ్ధి

మర్పల్లి : ఆరు గ్యారెంటీల అమలుతో ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. మర్పల్లి మండలం తుమ్మలపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, నాయకులు సుభాష్‌యాదవ్ ఆధ్వర్యంలో స్పీకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మర్పల్లి మండ లంలోని కొత్లాపూర్, సిరిపురం, వీర్లపల్లిలో నాయకులు ఉపాధి కూలీలకు ఆరు గ్యారెంటీలను వివరించారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న రంజిత్‌రెడ్డి

నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటున్న వ్యక్తి రంజిత్‌రెడ్డి అని ఆయన సతీమణి సీతారెడ్డి అన్నారు. మర్పల్లి మండలం పట్లూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ రంజిత్ రెడ్డిని ఎంపీగా గెలిపించాలన్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం

నవాబుపేట/మొయినాబాద్/హైదర్‌నగర్/ : నవాబుపేట మండలాధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య మండలంలోని లింగంపల్లి, పులుమామిడి, ఏక్‌మామిడి తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ మొయినాబాద్ మండల మాజీ అధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, రాష్ట్ర నాయకుడు షాబాద్ దర్శన్, మండలాధ్యక్షుడు మానయ్య, మాజీ సర్పంచ్ కె.నరోత్తంరెడ్డి ఆధ్వర్యంలో రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పెద్దమంగళారం మాజీ ఉపసర్పంచ్ మల్లారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాన్‌రెడ్డి, పాటి మాధవరెడ్డి, ఎం.బుచ్చిరెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్‌రెడ్డి సమక్షంలో తులసినగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

పహాడిషరీఫ్ : రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు, మహేశ్వరం నియోజకవర్గం మామిడిపల్లి, రంగా నాయకుల కాలనీలో పాదయాత్ర చేస్తూ రంజిత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జలపల్లి మున్సిపాలిటీలో మజ్లిస్ పార్టీ సరూర్‌నగర్ మండల ప్రజా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఓమర్ బామ్ ప్రచారం చేశారు. సందేశ్ నగర్, అబుబాకర్ కాలనీల్లో నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.

విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయం

● చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా సతీమణి సంగీతారెడ్డి

వికారాబాద్/మర్పల్లి, మే 7 : చేవెళ్ల నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి విజయం తథ్యమని కొండా సతీమణి సంగీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం వికారాబాద్ పట్టణంలో మహిళలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో అతి ముఖ్యమైన బూత్ ఏజెంట్ల ప్రాముఖ్యత, మహిళల పాత్ర గురించి చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీకి, అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి అభ్యర్థిత్వం పట్ల మంచి స్పందన వస్తోందన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని, ఢిల్లీలో మరోసారి ప్రధానిగా మోదీకి పట్టంగట్టాలని ప్రజలు ఎంతో పట్టుదలతో ఉన్నారన్నారు. చివరి క్షణంలో ఏ పథకాలు ప్రకటించినా, హామీలు ఇచ్చినా కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కమలం గుర్తుకు ఓటేసి కొండాను గెలిపించాలని కోరారు. బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు యాస్కి శిరీష, సుచరిత, తదితరులు ఉన్నారు.

జనార్దన్‌రెడ్డిని కలిసిన విశ్వేశ్వర్‌రెడ్డి


తనకు మద్దతివ్వాలని జనార్దన్‌రెడ్డిని కోరుతున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గత లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేసి రెండు లక్షలకు పైగా ఓటు బ్యాంకు సాధించిన బీజేపీ రాష్ట్ర నేత బి.జనార్దన్‌రెడ్డిని విశ్వేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆయన నివాసానికి వెళ్లి సుదీర్ఘంగా చర్చించారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో తనకు మద్దతిచ్చి సహకరించాలని కోరారు. గతంలో చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జిగా పనిచేసిన తమ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని, అన్ని విధాలుగా సహకరించి తనను గెలిపించే బాధ్యత తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేయగా, జనార్దన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ఈ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా తనవంతు పాత్ర పోషిస్తానని హామీ ఇచ్చారు. విశ్వేశ్వర్‌రెడ్డి వెంట మాజీ ఎమ్మెల్యే రత్నం, నాయకులు నవీన్‌రెడ్డి, మల్లారెడ్డి, పలువురు సీనియర్ నాయకులున్నారు. ఇదిలా ఉంటే, విశ్వేశ్వర్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి భేటీ కావడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి బీజేపీ అభ్యర్థి విజయం ఖాయమనే ధీమా వారిలో వ్యక్తమవుతోంది.

అమిత్‌షా బహిరంగ సభను జయప్రదం చేయాలి

అమిత్‌షా బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్ల నందు కోరారు. మర్పల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్‌షా 11న వికారాబాద్‌కు రానున్నట్లు తెలిపారు.


షాబాద్ : సతీష్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

షాబాద్ : పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు పీసరి సతీష్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మనోహర్‌రెడ్డితో పాటు ఏట్లఎర్రవల్లికి చెందిన యువకులు భారీఎత్తున పార్టీలో చేరారు. కొండా కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రత్నం, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలే బీజేపీ గెలుపునకు నాంది

చేవెళ్ల : కేంద్ర సంక్షేమ పథకాలే బీజేపీ గెలుపునకు నాంది అని, చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తాయని ఎంపీపీ విజయలక్ష్మి, చేవెళ్ల మండలాధ్యక్షుడు పాండురంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని పలు కాలనీల్లో నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు అడెట్ల శ్రీనివాస్, కేఎల్లార్, మల్లారెడ్డి, దేవుని శర్వలింగం, గణేశ్, ఎం.వైభవ్‌రెడ్డి, తదితరులున్నారు.

బీజేపీలో చేరిన శివరాజ్

వికారాబాద్ బీజేపీ పట్టణాధ్యక్షుడిగా గతంలో బాధ్యతలు నిర్వర్తించిన గడిగె శివరాజ్ కొంతకాలంగా పార్టీకి దూరమయ్యారు. జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.శివరాజ్ తదితర నాయకుల చొరవతో తిరిగి బీజేపీలో చేరారు. వికారాబాద్‌లో రాజస్థాన్ ఎమ్మెల్యే ఛగన్‌సింగ్ పురోహిత్ సమక్షంలో ఆయనతో పాటు పలువురు బీజేపీ నాయకులు పార్టీలో చేరారు. కేపీ రాజు, అనిల్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడిస్తాం

తాండూరు రూరల్ : మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్‌ను ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు మాదిగ అన్నారు. తాండూరు మండలం కోటబాస్పల్లి, ఐనెల్లి గ్రామాల్లో నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహ మాదిగ, తాండూరు మండల ఉపాధ్యక్షుడు జగదీష్, ప్రవీణ్, బి.రవి తదితరులున్నారు.

బీజేపీతోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ

యాలాల : బీజేపీతోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధ్యమని, విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని మండలంలోని చెన్నారం, అక్కంపల్లి, పగడిపల్లి, జుంటుపల్లి, పేర్కంపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెస్పీ జిల్లా కార్యదర్శి డప్పు మహేందర్, యాలాల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సూర్యప్రకాష్, తదితరులున్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి

కందుకూరు : ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని సీనియర్ నాయకులు జిట్ట రాజేందర్‌రెడ్డి కుందుకూరు మండలం దెబ్బడగూడలో ఆ పార్టీ నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. కె.సుధాకర్‌రెడ్డి, కె.మోహన్‌రెడ్డి, తదితరులున్నారు.

కొండా సమక్షంలో బీజేపీలో చేరికలు


వికారాబాద్ : రాజస్థాన్ ఎమ్మెల్యే ఛగన్‌సింగ్ పురోహిత్ సమక్షంలో బీజేపీలో చేరిన శివరాజ్

హైదరాబాద్ సిటీ : మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన 6వ డివిజన్ కార్పొరేటర్ మమత ప్రవీణ్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కండువాలు కప్పి ఆహ్వానించారు. మరోవైపు చేవెళ్ల నియోజకవర్గం పొల్గుట్టకు చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీ సీనియర్ నాయకుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా కొండా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు కాలం చెల్లిందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీరాములు యాదవ్, కొలన్ శంకర్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

అమలు కాని హామీలతో అధికారంలోకి..

● కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆరోపణ ● కీసరలో రోడ్‌షో..

కీసర, మే 7: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిందని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కీసరలో ఈటల రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధపు మాటలతో అధికారంలోని వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. తిరిగి ప్రజలను మోసం చేసేందుకు ముందుకు వస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో మహిళలకు బ్యాంక్ అకౌంట్‌లో రూ.2500 వేస్తానని, రైతులకు రుణ మాఫీ చేస్తామని, విద్యార్థినులకు స్కూటీ ఇస్తామని, రూ.4వేల పింఛన్ ఇస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి మోసపూరితపు మాటలు చెప్పాడని ఈటల అన్నాడు. ఇచ్చిన 6 గ్యారంటీలు, 66 హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డిని జూన్ 6వ తేదీ తర్వాత తన సంగతి తెలుతుందన్నారు. కావున ప్రజలు కాంగ్రెస్ చెప్పిన మోసపూరితపు మాటలను నమ్మకుండా 13వ తేదీన జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించి నరేంద్ర మోదీని మళ్లీ ప్రధానిని చేయాలన్నారు. కాగా, సాయంత్రం నుంచీ ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు రోడ్‌షో ముగిసే వరకూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రమ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్, తిరుమల్‌రెడ్డి, వెకట్ రెడ్డి, నల్లా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కీసర : మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఈటలకు జాతీయ వాయిద్య కళాకారుల సంఘం మద్దతు

మల్కాజిగిరి/మౌలాలి : ఈటల రాజేందర్‌కు జాతీయ వాయిద్య కళాకారుల సంఘం మద్దతును ప్రకటించింది. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు చెన్నారావు మంగళవారం మల్కాజిగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అంకితభావం కలిగిన ఈటల రాజేందర్‌కు తమ సంఘం తరఫున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని, కళాకారులందరూ రాజేందర్‌కు అండగా నిలిచి ఆయన విజయానికి కృషిచేస్తామని ప్రకటించారు. కళాకారులు బీవీ మోహనకృష్ణ మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా అంకితభావం కలిగిన ఈటలకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆర్‌కే నగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు.

ఈటలపై చేస్తున్న అబద్ధాలను నమ్మవద్దు

ఈటల రాజేందర్‌పై ఏఐతో మార్ఫింగ్ చేసిన తప్పుడు వీడియోను మౌలాలి కార్పొరేటర్ సునీతయాదవ్, సీనియర్ నాయకుడు మోహన్‌యాదవ్ ఖండించారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలను ఎవ్వరు నమ్మవద్దన్నారు. డివిజన్‌లోని ఆర్కే హెచ్ కాలనీలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ఈటలను గెలిపించాలని ప్రజలను కోరారు. అలాగే మౌలాలిలో పలు కాలనీలలో మోహన్‌యాదవ్ ప్రచారం చేశారు. కాగా, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి తప్పదని భావించి బీజేపీ అభ్యర్థిని దెబ్బతీసేందుకే ఫేక్ వీడియోలను వైరల్ చేస్తున్నాయని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఈటలపై ఫేక్ వీడియోను ఆయన తీవ్రంగా ఖండించారు.

రాజేందర్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే ప్రచారం

రామంతాపూర్ : రామంతాపూర్ డివిజన్ పరిధిలో బూత్ కమిటీల నాయకులు శాగ రవీందర్, వేముల వెంకట్‌రెడ్డి, ఆది సత్యనారాయణ, రేవు నర్సింహ, రాపోలు మహేందర్ ఆధ్వర్యంలో భరత్‌నగర్, శ్రీనగర్ కాలనీల్లో ఈటలకు మద్దతుగా రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బీజేపీ కరపత్రాలను పంపిణీ చేసి రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు ముత్తినేని జగదీష్, జగన్‌యాదవ్, తదితరులున్నారు.

ఈటలకు మద్దతుగా కిషన్‌రెడ్డి సతీమణి ప్రచారం

రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, హబ్సిగూడ కాకతీయనగర్ పార్కులలో వాకర్స్‌ను ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సతీమణి కావ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.హనుమంతరావులు కలిసి ఈటలకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. సీనియర్ నాయకులు చంద్రమౌళి, యశ్వంత్, సోమ శ్రీనివాస్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు. కాగా, రాజేందర్‌కు మద్దతుగా మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి చింతల మాణిక్యారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.


రామంతాపూర్ : వాకర్స్‌ను కలిసి ఈటలకు మద్దతు కోరుతున్న బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి సతీమణి కావ్య

రూ.94,550 సీజ్

దౌల్తాబాద్, మే 7: మండలంలోని చంద్రకల్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ కారులో రూ.94,550 నగదు లభించింది. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీశైలంయాదవ్ చెప్పారు.

11న బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతల పర్యటన

● వికారాబాద్‌కు అమిత్ షా.. తాండూరుకు ప్రియాంక గాంధీ

● ఒకేరోజు జాతీయ నేతల పర్యటనతో శ్రేణుల్లో జోష్

వికారాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఒకేరోజు వికారాబాద్ జిల్లాలో బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలు పర్యటించనున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 11వ తేదీన జిల్లాకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ రానున్నారు. వికారాబాద్‌లో బీజేపీ నిర్వహించే బహిరంగ సభకు అమిత్ షా హాజరుకానుండగా, తాండూరులో నిర్వహించే బహిరంగ సభకు ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు. ప్రియాంక పర్యటన మొదట 6వ తేదీన ఖరారు కాగా, ఆ తరువాత 10కి వాయిదాపడింది. కాగా, ప్రియాంక తాండూరు పర్యటన 11వ తేదీకి వాయిదా పడినట్లు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఒకేరోజు బీజేపీ, కాంగ్రెస్ జాతీయ నేతలు జిల్లాకు రానుండడంతో పార్టీల్లో నయా జోష్ నెలకొంది. మొదట అమిత్‌షా వికారాబాద్ పర్యటన 9వ తేదీన ఖరారు కాగా, ఆ తరువాత 11కు వాయిదా పడింది. శనివారం ఉదయం 11.30 గంటలకు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఏపీ కళాశాల మైదానం ఆవరణలో బీజేపీ బహిరంగ సభ జరగనుండగా, అదేరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు తాండూరులోని విలియమ్ మూన్ హైస్కూల్ గ్రౌండ్‌లో కాంగ్రెస్ బహిరంగ సభ జరగనుంది. ఎన్నికల ప్రచారం గడువు ముగిసే చివరిరోజే జిల్లాలో జాతీయ పార్టీల అగ్రనేతల పర్యటన ఖరారు కావడం చర్చనీయాంశంగా మారింది.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

● చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

షాబాద్, మే 7 : తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. షాబాద్‌లో రోడ్ షోలో ఆయన మాజీ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, షాబాద్ జడ్పీటీసీ అవినాష్‌రెడ్డిలతో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు నుంచి కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. బీసీ నేతనైన తనకు కేసీఆర్ ఎంపీగా అవకాశం కల్పించారని, కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, దర్శన్ తదితరులున్నారు.


షాబాద్ : మాట్లాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్, పక్కన ఎమ్మెల్యేలు యాదయ్య, సబితారెడ్డి

అబద్ధపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్..

కులకచర్ల/పూడూరు : అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సినిమా చూపిస్తోందని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మరోమారు మోసం చేసేందుకు సిద్ధమవుతుందనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలోని పీజేఆర్ ఫంక్షన్ హాలులో కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులను కేసీఆర్ పరామర్శిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో ఐపీఎల్ మ్యాచ్ చూసి ఎంజాయ్ చేశారని విమర్శించారు. జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని, ఢిల్లీలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధి కోసం పోరాటం చేస్తానని తెలిపారు. ఆరు నెలల్లో తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని, తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, తదితరులున్నారు. కాగా, హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని బీసీ సేనా జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ యూత్ వింగ్ మండలాధ్యక్షుడు కాట్న ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహుజనులంతా ఏకమై ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా కాసానికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బీజేపీ, కాంగ్రెస్‌లు ఒక్కటే..

పరిగి : బీజేపీ, కాంగ్రెస్‌లు ఒక్కటేనని సబితారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పరిగిలోని మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి నివాసంలో కాసాని జ్ఞానేశ్వర్, స్వామిగౌడ్, బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్‌రావులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ అభ్యర్థుల గెలుపుపై ఉన్న శ్రద్ధ సొంత పార్టీ అభ్యర్థులపై లేదన్నారు. బీజేపీ ఐదు ఎంపీ సీట్లు గెలిపించేందుకు మాజీ సీఎం కేసీఆరే లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని కాంగ్రెసోళ్లు చేస్తున్న ఆరోపణలను సబిత ఖండించారు. బీజేపీ సీట్లు గెలవాలని సీఎం రేవంత్ సహకరిస్తున్నారని ఆరోపించారు. బాడేబాయి(మోదీ), చోటాబాయి(రేవంత్‌రెడ్డి)లు ఇద్దరు ఒక్కటేనని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఒక్కసారి కూడా పాలమూరు పథకం గురించి మాట్లాడలేదన్నారు. శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ చేవెళ్ల నుంచి కాసానిని గెలిపించాలని కోరారు. జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ పదేళ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని కోరారు. ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ బస్సుయాత్రకు వస్తున్న స్పందన చూస్తే.. ఇతర పార్టీలకు భయం పుట్టుకుందన్నారు.

కాంగ్రెస్‌వి వారంటీలేని గ్యారెంటీలు

తాండూరు రూరల్ : వారంటీలేని గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. తాండూరు మండలం నారాయణపూర్, అంతారం గ్రామాల్లో బీఆర్ఎస్ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి తాండూరుకు ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యం

వికారాబాద్ : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కృషిచేసే ఉమ్మడి రంగారెడ్డి మాజీ జడ్పీ చైర్మన్, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓట్లేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకురాలు సావిత్రి ముదిరాజ్ కోరారు. కాసానికి మద్దతుగా వికారాబాద్ మండలం సాకేత్‌నగర్, కమలానగర్, సాయిబాబా నగర్,మారుతినగర్, కార్తికేయనగర్, మిత్రానగర్,లాలాగూడల్లో ప్రచారం చేశారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

చేవెళ్ల : బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మండలాధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. చేవెళ్ల మండలం ముడిమ్యాల్, కుమ్మెర, పామెన గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని న్యూ జర్నలిస్టు కాలనీ, సీపీఐ కాలనీల్లో ప్రచారం చేశారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. ఎంపీటీసీ సత్యనారాయణచారి, మాజీ సర్పంచ్ మాల్లారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్‌లు నర్సింలు, బీ.నర్సింలు, నాయకులున్నారు.

కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలి

కందుకూరు/హైదర్‌నగర్ : చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఏఎంసీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్‌లు కోరారు. కందుకూరు మండలం అగర్‌మియాగూడలో ప్రచారంలో పాల్గొన్నారు. లక్ష్మీనర్సింహారెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, తదితరులున్నారు. హైదర్‌నగర్ డివిజన్ మిత్రాహిల్స్, ప్రశాంత్‌నగర్, ఎఎస్‌రాజునగర్‌లో కార్పొరేటర్ శ్రీనివాసరావు ప్రచారం చేశారు.


కులకచర్ల : ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సబితారెడ్డి, పక్కన జ్ఞానేశ్వర్

ఎన్నికల వేళ కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'

● మహేశ్వరంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్

● కాంగ్రెస్‌లోకి మాజీ జడ్పీటీసీ, సర్పంచులు, ఉపసర్పంచులు

మహేశ్వరం, మే 7 : లోక్‌సభ ఎన్నికల వేళ మహేశ్వరం మండలంలో బీఆర్ఎస్‌లో చీలికలు, అధికార కాంగ్రెస్‌లో చేరికలు మరింత ఊపందుకున్నాయి. మహేశ్వరం మాజీ జడ్పీటీసీ ఈశ్వర్‌నాయక్‌తో పాటు నలుగురు బీఆర్ఎస్ మాజీ సర్పంచులు మల్లేష్‌యాదవ్, కంది అరుణరమేష్, శ్రీవారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఉపసర్పంచులు నర్సింహయాదవ్, శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీలో చేరారు. మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డిల సమక్షంలో చేరారు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మహేశ్వరం మాజీ ఎంపీపీ కె.రఘుమారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునితా అంధ్యానాయక్, తుక్కుగూడ మున్సిపల్ వైస్‌చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, తుమ్మలూరు మాజీ సర్పంచ్‌లు మద్దిసురేఖకరుణాకర్‌రెడ్డి, గంట నర్సిరెడ్డి, దుబ్బచర్ల మాజీ సర్పంచ్ శ్రీవారెడ్డిలు తాజాగా కాంగ్రెస్‌లో చేరారు. దాంతో మండలంలో దాదాపు బీఆర్ఎస్ నాయకత్వం ఖాళీ అయిపోయినట్లే. బీఆర్ఎస్ నాయకులతోపాటు గ్రామాల్లోని బీజేపీ కార్యకర్తలు కూడా కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. పదేళ్లుగా బీఆర్ఎస్‌కు అడ్డాగా ఉన్న మహేశ్వరం కాంగ్రెస్ గడ్డగా మారబోతోందనే వార్తలు జోరందుకున్నాయి.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఎల్లార్, అనిత

ఉచిత అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

● ఏకేఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమణ

ధారూరు, మే 7: టెట్, డీఎస్సీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం ఏకేఆర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రముఖ సైకాలజిస్ట్, జాతీయ వ్యక్తిత్వ వికాస నిపుణులు గంప నాగేశ్వరరావుతో మే 10వ తేదీన (శుక్రవారం) ఉదయం 10గంటల నుంచి ఉచిత అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఏకేఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే టెట్ పరీక్షను ఎలా ఎదుర్కోవాలి, ఒత్తిడిని ఎలా జయించాలనే అంశాలపై విద్యార్థులకు గంప నాగేశ్వరరావు మెళకువలు చెబుతారని వెల్లడించారు. మూడు గంటల పాటు ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ సైకాలజిస్టుతో జరిగే అ అవగాహన సదస్సు కాబోయే టీచర్లకు ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. వికారాబాద్ పట్టణంలోని శివరాంనగర్ కాలనీలోని హనుమాన్ టెంపుల్ ఆవరణలో ఈశిక్షణా శిబిరం ఉంటుందని ఆయన సూచించారు. వివరాలకు 9441022571 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

బస్టాండ్‌లో ప్రయాణికుల ఇక్కట్లు

● రెండు గంటలు వేచి చూసినా రాని హైదరాబాద్ బస్సులు ● పట్టించుకోని అధికారులు



వికారాబాద్ బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

వికారాబాద్, మే 7: ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించకపోవడం, అధికారులు ఇష్టానుసారంగా బస్సులను రద్దుచేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వికారాబాద్ బస్టాండ్‌లో మంగళవారం ఉదయం 8.30 గంటల తర్వాత హైదరాబాద్ వెళ్లడానికి బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సులు ఎప్పుడు వస్తాయని అడిగితే స్పందించే అధికారులే కరువయ్యారు. వికారాబాద్‌కు చెందిన విద్యార్థులు హైదరాబాద్‌లో ఇంజనీరింగ్, ఫార్మసీ తదితర కోర్సులు చదువుతున్నారు. ఇక్కడి నుంచి రోజూ ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు కొనసాగిస్తుంటారు. మంగళవారం హైదరాబాద్ వెళ్లడానికి బస్టాండ్‌కు వచ్చిన విద్యార్థులు, వ్యాపారులు రెండు గంటలైనా హైదరాబాద్ బస్సులేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. హైదరాబాద్‌కు వెళ్లడానికి వచ్చిన ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసిపోయింది. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రత్యేక బస్సులైనా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరినా ఆర్టీసీ అధికారుల స్పందన కొరవడింది. జిల్లా కేంద్రమైన వికారాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లడానికి బస్సు కోసం రెండు గంటలు వేచిచూడాలా? ఇదేం దౌర్భాగ్యమంటూ వ్యాపారులు, విద్యార్థులు తీవ్రస్థాయిలో ఆర్టీసీ అధికారులపై మండిపడుతున్నారు.

అటవీ ప్రాంతంలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

కులకచర్ల, మే 7: మండలంలోని అనంతసాగర్ అటవీ ప్రాంతంలో కుళ్లిన దశలో ఓ వృద్ధురాలి(65) మృతదేహం లభ్యమైంది. గ్రామానికి చెందిన మేకల కాపరులు మంగళవారం మధ్యాహ్నం అటవీ ప్రాంతంలోకి వెళ్లగా చెట్ల పొదల్లో కుళ్లిపోయిన వృద్ధురాలి మృతదేహం కనిపించిందని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అన్వేష్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వారం రోజుల కిందట గుర్తుతెలియని ఓ వృద్ధురాలు గ్రామంలో సంచరించిందని గ్రామస్థులు తెలిపారు. వృద్ధురాలి మృతదేహం కనిపించిందని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అన్వేష్‌రెడ్డి అక్కడికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గత వారం రోజుల క్రితం గుర్తు తెలియని ఓ వృద్ధురాలు గ్రామంలో సంచరించేందని గ్రామస్థులు తెలిపారు. వృద్ధురాలి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

దోమ, మే 7: పురుగుల మందు తాగిన ఓ మహిళ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని బొంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముద్దం చిన్న లక్ష్మి(32) భార్యాభర్తల మధ్య చిన్నగొడవ కారణంగా మనస్తాపానికి గురై ఈనెల 5న క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి కూతురు అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు.

ఉస్మానియా ఆస్పత్రిలో వ్యక్తి..

ధారూరు, మే 7: చికెన్ కర్రీ బోగనాలో పడి తీవ్రగాయాలతో ఉస్మానియా ఆస్పత్రిలో చేరిన వ్యక్తి సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు స్థానికులు తెలిపిన ప్రకారం.. మండలంలోని కుకింద గ్రామానికి చెందిన గోరెనకల మల్లయ్య(45) ఈనెల 2వ తేదీన ధారూరులో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి వచ్చాడు. సమావేశం ముగిసిన అనంతరం భోజనానికి వెళ్లాడు. చికెన్ కర్రీ వేసుకునేందుకు చికెన్ బోగనా వద్దకు వెళ్లాడు. ఇదే సమయంలో జనాల తోపులాటలో అదుపుతప్పి ఆయన చికెన్ కర్రీ బోగనాలో పడిపోడి తీవ్రగాయాలపాలయ్యాడు. ఆయనను వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదారాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో మల్లయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృత్యువాత



మృత్యువాతపడిన మేక

దోమ, మే 7: విద్యుదాఘాతంతో మేక మృత్యువాతపడింది. మండల కేంద్రానికి చెందిన గొల్ల పెంటయ్యకు చెందిన మేక గ్రామ శివారులోని రైస్ మిల్లు దగ్గర మేత మేస్తుండగా అక్కడే మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మంగళవారం అక్కడికక్కడే మృతిచెందింది. మృతి చెందిన మేక విలువ రూ.10వేలు ఉంటుందని, బాధితుడు పెంటయ్య వాపోయాడు. ప్రభుత్వం నుంచి తనకు ఆర్థిక సాయం అందించాలని కోరాడు.

14 మంది పేకాటరాయుళ్ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న నగదు

కడ్తాల్, మే 7 : మైసిగండి ఆల యం సమీపంలో వినోద్ ఫామ్ హౌస్‌పై మంగళవారం పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేశారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఫామ్ హౌస్‌లో హైదరాబాద్‌కు చెందిన 18మంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు దాడిచేసి 14 మందిని అదుపులోకి తీసుకొని రూ. 1.2లక్షలు, 14సెల్‌ఫోన్లు, పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి

● ఎంపీడీవో విశ్వప్రసాద్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, మే 7: జాబ్ కార్డు దారులంతా ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం తాండూరు మండలంలోని కోటబాస్పల్లి, గుంతబాస్పల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా శిశ్వప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఉదయం 6 గంటలకే పనికి వచ్చి ఉదయం 11గంటల వరకు పని చేయాలని సూచించారు. గ్రామాలకు ఉపయోగకరమైన పంట పొలాలకురహదారి సౌకర్యం, పంట కాల్వలు, కట్టు కాల్వల పూడిక తీత, ఫాంపాండ్స్, డ్రెయిన్ తదితర పనులు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఇంటింటికి ఇంకుడు గుంతలు, పశువుల పాక, మేకల, గొర్ల షెడ్, తదితర పనులు చేపట్టాలన్నారు. రూ.300లు పొందిన వారు మార్క్‌ఔట్ ప్రకారం పని చేయాలని సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతీఒక్కరు గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనుల్లో పాల్గొనాలని అన్నారు. చెరువులో పూడికతీత పనులకు 1క్యూబిక్ మీటరుకు రూ.194.90, ఎర్త్‌బండింగ్ 1క్యూబిక్ మీటరుకు రూ.272.46, భూమి చదునుచేసే పనికి 1క్యూబిక్ మీటరుకు రూ.235.44, పాతకాల్వల పూడికతీత పనులకు 1క్యూబిక్ మీటరుకు రూ.194.94, రోడ్డు నిర్మాణానికి 1క్యూబిక్ మీటరుకు రూ.370.54, ఫారంపాండ్స్ 1క్యూబిక్ మీటరుకు రూ.302.54 అందించనున్నట్లు తెలిపారు. ఈనెల 2వ తేదీ వరకు పనిచేసిన ఉపాధి కూలీల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయని తెలిపారు.

ఉన్నత విద్య అందించడమే లక్ష్యం



శ్రీమాతకు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేస్తున్న ఇన్‌చార్జి వీసీ క్రిస్టోఫర్

మొయినాబాద్ రూరల్, మే7: తమ యునివర్సిటీ విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించడమే లక్ష్యమని చైత్యనడీమ్డ్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆర్.క్రిస్టోఫర్ అన్నారు. యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు రాజ్‌కుమార్ నాగవత్, బండి శ్రీమాత, చాడ సత్యనారాయణ, పందిరి మాధురి వివిధ విభాగాల్లో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పట్టాలను పొందారు. ఈ సందర్భంగా వారిని యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ మంగళవారం వారిని యూనివర్సిటీలో ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి పీహెచ్‌డీలు పొందడం అభినందనీయం అన్నారు. పరిశోధనలు చేసిన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రవీందర్, యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, ప్రొఫెసర్లు జగదీశ్వర్, సుందర్‌రామ్, రాజు, ఇతర అధ్యాపకులతో పాటు పబ్లిక్ రిలేషన్ అధికారి గాదె రాంబాబు పాల్గొన్నారు.

ఏస్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌కు డాక్టరేట్



విజయ్‌కుమార్

ఘట్‌కేసర్ రూరల్, మే 7: అంకుషాపూర్ ఏస్ ఇంజనీరింగు కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ చందారపు విజయ్‌కుమార్‌కు కంప్యూటర్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ లభించింది. అనంతపూర్‌లోని జేఎన్టీయూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాన మాధవి ఆధ్వర్యంలో 'అన్ ఎఫెక్ట్ రీసోర్స్ అలకేషన్ ఇన్ బిగ్‌డేటా కంప్యూటింగ్ ఫర్ స్ట్రీమింగ్ డేటా' అనే అంశంపై చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ పొందారు. ఏస్ కళాశాల చైర్మన్ వై.గోపాలకృష్ణ మూర్తి, సంయుక్త కార్యదర్శి ఎం.పద్మావతి, ప్రిన్సిపల్ బీఎల్ రాజు, అధ్యాపకులు డాక్టరేట్ పొందిన విజయ్‌కుమార్‌ను అభినందించారు.

జాతీయస్థాయి హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ



హ్యాకథాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, మే 7: మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో జాతీయస్థాయి హ్యాకథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనురాగ్ ఈఈఈ, సీఎస్‌సీ కోడింగ్ క్లబ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విభాగం సహకారంతో జూన్ 20 నుంచి 22వ తేదీ వరకు స్మార్ట్‌హ్యాక్స్ 2౩24-బి ఎడిషన్ పేరుతో 48గంటల పాటు జాతీయస్థాయిలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం డీన్ విజయ్‌కుమార్, హెచ్‌వోడీలు మల్లికార్జున్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీదేవిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు తృప్తి, ప్రదీప్ కుమార్, స్టూడెంట్ కోఆర్డినేటర్లు కార్తీక్‌రావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

కొడంగల్, మే 7: మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఉపసర్పంచ్ బి.హన్మయ్య, మాజీ వైస్ఎంపీపీ ఎన్.నర్సింహులు, చిన్నా, హన్మయ్య, శివప్పతో పాటు 50మంది నాయకులు కొడంగల్‌లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీయడం సరికాదు



కులకచర్లలో మాట్లాడుతున్న వెంకటయ్యగౌడ్

కులకచర్ల, మే 7: హిందువుల మనోభావాలను దెబ్బతీయడం సరికాదని విశ్వహిందూ పరిషత్ మాజీ జిల్లా అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు ఘనపూర్ వెంకటయ్యగౌడ్ అన్నారు. కులకచర్లలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా అనుచితవ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. 100కోట్ల హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన ఆయనను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థ ప్రముఖ్ రాజేశ్వర్, బీజేపీ నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

కులకచర్ల, మే 7: మండల కేంద్రంలోని ఎత్తుకాల్వ తండాకు చెందిన నేనావత్ బుగ్గమ్మ(65) అనారోగ్యం కారణంగా మంగళవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు తాను అందుబాటులో లేకపోవడంతో తన అనుచరుల ద్వారా రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా నాయకుడు రాజేందర్‌నాయక్, తండావాసులు పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. రాత్రి వాన

ధారూరు, మే 7: వికారాబాద్ జిల్లా ప్రజలకు మంగళవారం విచిత్ర పరిస్థితి ఎదురైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతీవ్రతతో అల్లాడిపోగా సాయంత్రం 6గంటల తరువాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. రాత్రి 7గంటల ప్రాంతంలో గంట పాటు ఓ మోస్తారు వర్షం కురిసింది. కురిసిన వర్షానికి మర్పల్లిలో 4.5 మి.మీ, నవాబుపేటలో 2.8 మి.మీ, వికారాబాద్‌లో 1.5మి.మీల వర్షాపాతం నమోదైంది. ఇదిలా ఉండగా పలుసార్లు వికారాబాద్ జిల్లా కేంద్రంలో విద్యుత్ అంతరాయం ఏర్పడడం, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో కురుస్తున్న వర్షం



ధారూరు: వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం





కీసరలో కురుస్తున్న వర్షం



మేడ్చల్‌లో గొడుగులతో వెళ్తున్న స్థానికులు



మర్పల్లిలో కురుస్తున్న వర్షం

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

మంచాల, మే 7 : ఇటీవలి పదోతరగతి ఫలితాల్లో బోడకొండ జెడ్పీహైస్కూల్ విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించడంపై గ్రామపెద్దలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు శాలువాతో సత్కరించి ఎంపీపీ నర్మదలచ్చీరాం, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు వనపర్తి బద్రీనాథ్‌గుప్తా ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేరు. గ్రామపెద్దలు మాట్లాడుతూ విద్యార్థులు మరింత ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమేష్, మోత్యా, శ్రీను పాల్గొన్నారు.



బోడకొండ మెరిట్ సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న గ్రామపెద్దలు

ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం, మే 7: 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 6 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మొదలైందని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ప్రభు మంగళవారం తెలిపారు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియ మూడు దశల్లో ఉంటుందని చెప్పారు. రిజిస్ట్రేషన్, కళాశాల ఎంపిక(వెబ్ ఆప్షన్స్)లో సమస్యలకు కళాశాలలో గానీ లేదా మొబైల్ నంబర్ 9440571781, 9052867711, 9618564824లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పెరిగిన ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు

● 8 పోలింగ్ కేంద్రాలకు బై నెంబర్లు
● మహిళా ఓటర్లే అధికం

తాండూరు, మే 7: చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లతో పాటు పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. కొత్త పోలింగ్ కేంద్రాల్లో పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వికారాబాద్ జిల్లాలో తాండూరు అసెంబ్లీ నియోజకవర్గం లోనే కొత్త పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. ఈ పోలింగ్ కేంద్రాలకు అదనంగా పోలింగ్ సిబ్బంది, పోలింగ్ మెటీరియల్‌ను కేటాయించనున్నారు. పెరిగిన పోలింగ్ కేంద్రాలకు బైనెంబర్లు కేటాయించనున్నారు.

మహిళా ఓటర్లే అధికం

తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రస్తుతం పెరిగిన ఓట్లలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం 8117 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. పురుషులు 6579 మంది పెరిగారు. ఈ ఎన్నికల్లో మహిళలు కీలక పాత్ర పోషించనున్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో 14వేల ఓట్ల తేడాతోనే గెలుపును సాధించారు. ప్రస్తుతం తాండూరు సెగ్మెంట్ లో 14697 ఓట్లు పెరిగాయి. దీంతో ఈ ఓట్లు కీలకమే.

పెరిగిన పోలింగ్ కేంద్రాలు

అసెంబ్లీ ఎన్నికల్లో 269 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎనిమిది కేంద్రాలు పెరగడంతో 277 కేంద్రాలకు సంఖ్య పెరిగింది. పెద్దేముల్ మండలంలో ఎనిమిది పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. కందనెల్లి తండా (54/ఎ), ఊరేంటి తండా(1/ఎ), సిద్దన్నమడుగు తండా (9/ఎ), ఎర్రగడ్డ తండా (15/ఎ), జైరాం తండా (18/ఎ), ఖానాపూర్ (24/ఎ), బండపల్లి (29/ఎ), మారపల్లి తండా (39/ఎ), కొత్త పోలింగ్ స్టేషన్‌లతో కలిపి పెద్దేముల్ మండలంలో 54, కోట్‌పల్లి మండలంలో ఎనిమిది, తాండూరు మండలం 50, తాండూరు పట్టణంలో 70, యాలాల మండలంలో 48, బషీరాబాద్ మండలంలో 47 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

పెరిగిన ఓటర్లు

2023 డిసెంబర్‌లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలకు ప్రస్తుతం నిర్వహిస్తున్న లోక్‌సభ ఎన్నికలకు మధ్య మూడు నెలల వ్యవధిలో తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 14,697 మంది ఓటర్లు పెరిగారు.

మండలం పేరు	అసెంబ్లీ ఓటర్లు	మహిళలు	పురుషులు	పార్లమెంట్‌లో	మహిళలు	పురుషులు	పెరిగిన ఓటర్లు
పెద్దేముల్	37840	19313	18527	39906	20,487	19,419	2066
కోట్‌పల్లి	5922	3043	2879	6121	3150	2971	199
తాండూరు	42582	21731	20851	45116	23091	22024	2534
తాండూరుపట్టణం	66304	33651	32653	71331	36395	34931	5027
యాలాల	38207	19857	18350	40804	21338	19465	2597
బషీరాబాద్	37640	19658	17982	39914	20903	19011	2274
మొత్తం	2,28,495	117253	111242	243192	125364	117821	14697

నరేంద్రమోదీ వ్యక్తి కాదు శక్తి



కొడంగల్‌లో రోడ్‌షోలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే.అరుణ

కొడంగల్, మే 7: దేశభద్రతా, రక్షణలో నరేంద్రమోదీ వ్యక్తి కాకుండా శక్తిగా నిలిచారని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే.అరుణ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొడంగల్ నియోజకవర్గ కేంద్రం అంబేడ్కర్ చౌరస్తాలో కామారెడ్డి, గోషామహల్ ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, రాజాసింగ్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించి మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలు, మత విద్వేషాలు ఇతరాత్రా వాటితో దేశరక్షణకు భంగం వాటిల్లేదన్నారు. ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో దేశరక్షణ, ప్రజల భద్రతా, తెలంగాణ అభివృద్ధి జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఓడించేందుకు పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచినట్లు డీకే.అరుణ తెలిపారు. పాలమూర్ జిల్లాకు రేవంత్‌రెడ్డి చేసిందేమి లేదని, తమ పోరాటాలతోనే అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో అహంకార పూరితంగా వ్యవహరించడంతో ప్రజలు ఇంటికి సాగనంపారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన హోదాను మరచి కేసీఆర్ కుదీటుగా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. గతంలో తన తండ్రి నర్సిరెడ్డి, సోదరుడు, తాను ప్రాణాలను లెక్క చేయకుండా జిల్లా అభివృద్ధికి పోరాటం చేశామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పూనంచంద్‌లాహోటీ, బస్వరాజ్, బంటు రమేశ్, రవీందర్‌నాయక్, రాకేశ్, సర్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతిమణి

ఘట్‌కేసర్, మే 7: కార్యకర్తలు శక్తివంచన లేకుండా శ్రమించి మాల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకోవాలని ఏఐసీసీ పరిశీలకురాలు, తమిళనాడు ఎంపీ జ్యోతిమణి కాంగ్రెస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం రాత్రి పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని ఎస్‌బీఆర్ గార్డెన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డీసీసీ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పూడూరు మండల కార్యదర్శిగా శ్రీకాంత్‌గౌడ్



శ్రీకాంత్‌గౌడ్

పూడూరు, మే 7: బీజేపీ పూడూరు మండల కార్యదర్శిగా మండలంలోని కడుమూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ ఉపాధ్యక్షులు మల్లేష్ శ్రీకాంత్‌గౌడ్‌కు కార్యదర్శిగా నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం కడుమూరు గ్రామంలో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.